

■ రమ శకుంతలా వాళ్ళ ఇంటికి స్నేహంగా వెళ్ళి తన పెళ్ళి శుభ వార్త చెప్పింది.

శకుంతల తల్లి పద్మావతమ్మగారు 'కట్నమెంత రమా?' అని అడిగింది.

'ఎంత గొప్ప సంబంధమైనా, కట్నం కావాలన్న వాణ్ణి నేను చేసుకోనని మొదటే చెప్పేశాను మా నాన్నగారితో.' అంది రమ.

'ఐతే కట్నం అడగని సంబంధమే దొరికిందన్నమాట...మీనాన్నగారు అదృష్టవంతులు.'

'కట్నం పుచ్చుకోవడం కన్యను కొనడం' అనే వరులు ఇప్పుడు చాలామంది ఉన్నారమ్మా. అందం, చందం, చదువూ, సంస్కారం ఉన్న రమాదేవికి కట్నం కోరని పెళ్ళికొడుకు రావడంలో ఆశ్చర్యం లేదు' అన్నాడు శకుంతల అన్నగారు ఆనందరావు.

రమ, 'వెళ్ళొస్తానండీ మరి...శకుంతలని పంపితే చాలనుకుంటారేమో. మీరంతా రావాలి.' అంటూ మరీ మరీ చెప్పి వెళ్ళింది.

చిత్రమేమిటంటే. అది ఇంతకీ కట్నం లేని పెళ్ళికాదు! పురోహితుడు కన్యాప్రదాతతో 'రాజశేఖరంగారూ, వరదక్షిణ సమర్పించవలసిన సమయం వచ్చింది' అనే వరకూ కట్నం ఉన్నదన్న సంగతి తెలిసింది కాదు.

ఆనంద్ శకుంతలతో, 'ఏమే చెల్లాయ్, కట్నం లేదండిగా రమానేవి?...... కోతలు కోసిందన్నమాట!' అన్నాడు.

'అలాంటిది కాదన్నయ్యా రమ; కట్నం ఇస్తున్నామంటే వద్దంటాడేమోనని, వాళ్ళు లేదన్నారేమో' అంది శకుంతల.

కట్నమెంతో తెలుసుకోవాలన్న కుతూహలంతో పెళ్ళి పందిట్లో ఆబాలగోపాలం ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉండిపోయారు.

రాజశేఖరంగారు దిక్కులు చూస్తూ 'మా అబ్బాయి వెళ్ళినవాడు అక్కడే ఉండి పోయాడు!' అని పిలిచారు.

'భానుమూర్తి ఇక్కడికి వెళ్ళాడు...'

'తెలుస్తాలెండి. ఆలస్యం కాకుండా ఆ నిర్ణయించుకున్న పదివేలూ చదివించండి' అంటూ రాజశేఖరంగారు వెండి పళ్ళెంలో కొన్ని నోట్లకట్టలను అందించారు.

'పదివేలే!' అన్నాడొకడు మెల్లగా. వాడి పక్కవాడు; బోలెడు భూమీ; లక్షలూ ఉన్న సంబంధం మరి; 'పదివేలు' అంటే ఆశ్చర్యపడవలసినంత గొప్పరేటు ఏమీకాదు' అన్నాడు.

'ఆనంద్, 'పదివేలంటే టూమచ్చే అనిపిస్తోంది నా మటుకి' అన్నాడు శకుంతలతో. 'టూమచ్ ఏమిటన్నయ్యా? వస్తువును విక్రయించడానికి ఒప్పుకున్న

వాళ్ళు వచ్చేసేంత దాకా రాబట్టతారు!' అంది శకుంతల.

'పెళ్ళికొడుకులు బజార్లో అమ్ముడుపోయే వస్తువులంటావ్?'

''వస్తువు' అనే పదం నీకు నచ్చకపోతే 'జంతువులు' అందాం పోనీ!' అని హేళనగా సమాధానమిచ్చింది శకుంతల.

రమ తల్లితో మెల్లిగా 'అమ్మా'అంది.

'ఏమే?'

'కట్నం లేదన్నావ్ నాతో?'

'తరువాత చెబుతాలే...'

వరుని తండ్రి గౌరీపతిగారు కరెన్సీ నోట్లు లెక్క చూసి, 'బావగారూ, 'పది వేలు' అని చదివించి, తొమ్మిది వేలే ఇచ్చారేమిటి?' అన్నాడు నిర్మొగమాటంగా.

రాజశేఖరంగారు సగం చచ్చినవాడికిమల్లే ఐపోయి, 'తమతో ఇందాకా మనవి చేసుకున్నాను కదండీ? అప్పిస్తానని నమ్మించిన షావుకారు పెళ్ళిగ్గాం వస్తే ఆ తొందరలో నా మాట మరిచిపోయినట్టున్నారు. వెళ్ళిపోయాడు. అప్పుడు వాళ్ళనూ వీళ్ళనూ అడిగి తెచ్చాను కాని ఇంకా రెండువేలు తక్కువయాయి. షావుకారు రావడంతోనే ఆ రెండు వేలూ పుచ్చుకొని సర్దుబాటు చేస్తాను అని తమతో మనవి చేశాను.'

'సి. మే. కాని ఇకదంతా కుదరదని చెప్పేశానుగా. తీరా పీటలమీద కూర్చున్నాక ఇలా దగా చేస్తారా?'

'క్షమించాలి బావగారూ. ఇందులో దగాయేం లేదు. మీరు కుదరదన్నారనే నా భానుమూర్తిని మారువాడీ దగ్గరకు పంపేను. వాడికోసమే ఎదురు చూస్తున్నాను... సుముహూర్తం ఆసన్నమౌతోందని పది వేలూ చదవమన్నాను. పీటల మీది నుంచి లేవకుండానే మా వాడు వచ్చేస్తాడు.'

'అదేం పనికిరాదు. ఆ రెండు వేలూ వచ్చినప్పుడే సుముహూర్తం! ఆలోగా రెండు ముళ్ళూ పడనీయ్యను!' అన్నారు గౌరీపతిగారు.

ఆనంద్ చటుక్కుని, 'పోనీ రెండు ముళ్ళే వెయ్యించండి' అన్నాడు కొంటెగా.

పందిట్లో వాళ్ళంతా ఫక్కుమని నవ్వేరు. గౌరీపతిగారు ఉగ్రుడై ఆనంద్వైపు తిరిగి 'మధ్య నువ్వెవడివోయ్ పానకంలో పుడకలాగ?' అన్నారు.

'నేనాండి. నన్ను ఆనందరావంటారు. పెళ్ళికుమార్తె అన్న భానుమూర్తి ఉన్నాడు చూడండి, అతడూ. నేనూ క్లాసుమేట్సును. వచ్చేనెలలో ఫైనలియరు పరీక్షకు కూర్చుంటున్నాం. ఇంకా వివరాలు కావలిస్తే మనవి చేస్తాను' అన్నాడు ఆనంద్.

రాజశేఖరంగారు ఆనంద్తో, 'నువ్వూరుకో బాబూ.' అని అనునయిస్తుండగా భానుమూర్తి ప్రవేశించి 'ఆ మార్వాడీ బంగారం మీదగాని అప్పు ఇవ్వనన్నాడు' అని సంగతి చెప్పేడు. రాజశేఖరంగారి తోబుట్టువు శేషమ్మ తన వడ్డాణం తీసి ఇచ్చింది. 'నీనగ ఇవ్వడమేమిటి వదినా?' అంటూ పెళ్ళికుమార్తె తల్లి తన కాసులపేరు తీసింది. 'ఇప్పుడు నగలీ విడితే సుముహూర్తానికి అందుకోలేదు' అన్నాడు కన్యాదాత.

'ఐతే వియ్యంకుడుగారూ, ఆ మార్వాడీకి బదులు మీరే రెండు నగలూ ఉంచుకోండి. మిగతా రెండువేలూ ముట్టేక మాకు ఇచ్చెయ్యవచ్చు.' అంది శేషమ్మ.

గౌరీపతిగారు ఒప్పుకోలేదు. 'అదేం బంగారమో, ఎంత చేస్తుందో?... ముహూర్తానికే పెళ్ళి ఐపోవాలని ఎక్కడుంది? సొమ్ము సర్దుబాటైన తర్వాతే అప్పుడు చెయ్యవచ్చు.'

రాజశేఖరంగారికి కళ్ళనీళ్ళు కమ్మేయి. శకుంతల, 'ఇంతవరకూ వచ్చాక ఈ పెళ్ళికొడుకు మాట్లాడక బెల్లం కొట్టిన రాయిలా కూర్చుండిపోయాడేమిటి?' అంది అన్నగారితో.

రమ పెళ్ళికొడుకుతో మెల్లిగా, 'మీరు కలుగజేసుకోవలసిన సమయం వచ్చింది' అంది.

'నేనా? నేనేం కలుగజేసుకోను? పెద్దవాళ్ళ విషయం ఇది' అన్నాడా రథాంగపాణి.

'పెద్దవాళ్ళ వల్ల పరిష్కారం కాలేదు కనుకనే ఇంక మీరు కలుగజేసుకోవాలి. మీ నాన్నగారిని ఒప్పించండి ... వేళ్లోగా మిగతా సొమ్ము ఇచ్చేస్తామంటున్నారుగా మా వాళ్ళు?'

'ఇవ్వకపోతేనో అంటాడు మా నాన్న.' అన్నాడా కుమారుడు.

రమకి ఒళ్ళు మండింది. కాని తమాయించుకుని మెల్లిగానే చెప్పింది.

గౌరీపతిగారు, 'ఏమిటిరా అంటోంది పెళ్ళికూతురూ?' అని అడిగేరు. రథాంగపాణి నీళ్ళు నమిలేశాడు. శకుంతల, 'నేను చెబుతానండి. 'మిగతా రెండువేలూ బాకీ కింద రాసుకోండి. మా నాన్న తీర్చలేకపోతే నేను ఉద్యోగం చేసి ఆ రెండువేలూ గడించి ఇచ్చేస్తాను. అంతవరకూ నన్ను కాపురానికి తీసుకు వెళ్ళద్దు పోనీ' అంటోంది పెళ్ళికూతురు.'

గౌరీపతిగారు, 'గడుసుదే అమ్మాయి! మా వాణ్ణి ఇప్పుడే బుట్టలో పెట్టేసుకుందాం అనుకుంటోందన్నమాట!' అన్నారు.

ఈసారి రమ అందరికీ వినబడేట్టే చెప్పింది. 'నేనెవర్నీ బుట్టలో పెట్టడం లేదు. నన్నే మా వాళ్ళు బుట్టలో పెట్టి సమర్పించారు; తొమ్మిది వేలు తెచ్చిపోశారు. ఆ మిగతా రెండువేలూ వెంటనే ఇవ్వలేకపోవడానికి కారణం కనబడుతూనే ఉన్నా మీరు ఒక్క మెట్టు ఐనా దిగనంటున్నారు. దీనివల్ల నేను మెట్టబోయే యిల్లు ఎలాంటిదో తెలుస్తోంది!'

'మాటలు తిన్నగా రానియ్. నేను ఎవరిననుకున్నావ్, నీ మామగార్ని! నాతోనేనా ఇలా అవమానంగా మాట్లాడుతున్నావ్?'

'అయ్యా, అవమానం ఏం జరిగినా నాకూ జరుగుత! అందం, చందం, చదువూ, సంస్కృతీ అన్నీ ఉన్నా రూపాయల సంచులు దిమ్మరిస్తేనేగాని మీ కుమారుడితో సరితూగనని భీష్మించుక్కూచుని, నన్నూ నలాంటి ఆడపిల్లల్నీ అవమానిస్తున్నారు! మామగారినన్నారు కదూ, ఆ రెండువేలూ కక్కితేనేగాని మూడు ముళ్ళూ పడవన్న మహానుభావులు నాకు మామగారెలా అయ్యారు?'

గౌరీపతిగారికి ఏమనాలో తోచక 'అబ్బో, చాలా చదివేవే!' అన్నారు.

'ఔను. చదివాను. కాని యీ చదువు విలువ మీరుగాని చదువుకున్న మీకుమారుడుగాని తెలిసికోవడానికి ఏం ప్రయోజనం? ఆడదాని విలువ గుర్తించి కట్నం అక్కర్లేకుండా పెళ్ళిచేసుకున్నే మగవాడు వచ్చినప్పుడే ఇంక నేను పెళ్ళి చేసుకుంటాను!'

'చేసుకో... నిక్షేపంలా చేసుకుని ఊరేగు! మేం వద్దనం.. లేరా అబ్బాయ్!' అంటూ లేచారు గౌరీపతిగారు.

'కొంచెం ఆలోచించండి నాన్నా' అన్నాడు అబ్బాయి.

# అమూల్యరత్నం

'ఏమిట్రా ఆలోచించేది? ఈ బ్రహ్మ రాతసిరి చేసుకుని వేగగలమనే ఇంకా?'

ఆ మాటలు చెవిని బడంతోనే భాను కోపంతో ఉగ్రుడై, 'ఏమండోయ్ గౌరీపతి గారు; మాటలు జాగ్రత్తగా రానివ్వండి' అంటూ ముందుకి వెళ్ళేడు. ఆనంద్ ఆపుకున్నాడు.

రాజశేఖరం గారు పెళ్ళికొడుకుని జబ్బ పట్టుకుని లేవదీసుకు పోతున్న గౌరీపతికి అడ్డు వెళ్ళి, 'బాబా క్షమించండి; వెళ్ళి పోకండి. మీ కాళ్ళమీద పడతాను!' అన్నారు గద్గద స్వరంతో.

రమ లేచి, 'నాన్నా ఆగు; ఆయన కాళ్ళ మీద పడవలసిన అవసరమేమిటి నీకు?' అని గట్టిగా అరచింది.

రాజశేఖరంగారు గద్దిస్తూ, 'తోపతికి పోయ్ నువ్వు! నువ్వూ భానూ మండే నిప్పులో నెయ్యి పోసి భగ్గుమనిపిస్తున్నారు! ఇద్దరికీ నాకు తలవంపులు తెచ్చారు.'

'నువ్వే నాకు తలవంపులు తెచ్చావు నాన్నా! కట్నం కావాలన్నవాణ్ణి చేసుకోనని మొదట్నుంచీ చెబుతూనే ఉన్న నేను రేపు కాలేజీలో తోటిపిల్లల ముందు తల వంచు కోవాలి. కట్నం ఇవ్వడం లేదని నువ్వూ అమ్మకూడా నాతో అబద్ధం చెప్పేరు.'

రమ తల్లి 'నీ కోసమే అబద్ధమాడేం మరి? మంచి సంబంధాలు కావాలంటే కట్నం లేకుండా వస్తాయా తల్లీ?' అని నచ్చచెప్ప బోయింది.

'హుఁ! మంచి సంబంధం! — ఏమిటో ఆ మంచి? నాకేం లోపం వుందని ఇలా లంచమివ్వడానికి సిద్ధపడ్డారు మీరు?'

ఆనంద్ అనునయంగా, 'అయ్యా గౌరీపతిగారూ, మీరు పెళ్ళి చేసుకుని ఇక్కడ నుంచి వెళ్ళేలోగా ఆ రెండువేలూ నేను తెచ్చి ఇస్తాను. నా బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు సిద్ధంగా ఉంది' అన్నాడు.

ఆ మాట విన్న రమ, 'మిస్టర్ ఆనంద్, వినండి; ఊరికే చేసుకుంటానన్నా ఈ సంబంధం నాకు వద్దు!'

ఆనంద్, 'అలా తొందరపడి మాట్లాడకు రమాదేవీ' అని రథాంగపాణితో, 'మిస్టర్ బ్రైడ్ గ్రూమ్, యూ ఆర్ లూజింగ్ ఎ జెమ్!' అన్నాడు.

'తెలుగులో అఘోరించవోయ్ అదేమిటో నూ' అన్న గౌరీపతితో ఆనంద్ మర్యాదగానే, 'మీ అబ్బాయి ఒక అమూల్య రత్నాన్ని జారవిడుచుకుంటున్నాడయ్యా' అన్నానండీ మీ అబ్బాయితో.'

గౌరీపతి, 'అమూల్యరత్న' మని తెలిసి పోతున్నావు గనుక నువ్వే కట్టుకో రాదూ?' అన్నాడు హేళనగా నవ్వుతూ వెళ్ళడం మాను కుంటూ.

ఆనంద్ నిర్ఘాంతపోయాడు. వెంటనే తేరుకుని నవ్వుతూ, 'నన్నే పెళ్ళి చేసుకో మంటున్నారా రమాదేవిని? అంతకంటేనా? కాని నేనామె అందానికి తగను. అందువల్ల కాని లేకపోతే ఆ శుభకార్యమేదో మీ చేతి మీదుగానే జరిపించి వెళ్ళమని కోరుదును... దానికేంగాని నామాట వినరూ?'

గౌరీపతిగారు కొడుకు భుజం పట్టుకుని లాక్కుపోయాడు. ఆయన తరవాత వచ్చిన వాళ్ళు కొద్దిమందే. వారిలో ఎవరూ 'నువ్వు చేస్తున్నపని సబబుకాదు సుమా.' అని ఆయనకు చెప్పలేకపోయారు. ఆయన భార్య చెప్పేదేకాని ఆమె చనిపోయి స్వర్గాన ఉండడంవల్ల, అసలు జరగలేదు. ఆనంద్ పోతూన్న వాళ్ళకేసి చూస్తూ, 'అభాగ్యులు;' అనుకున్నాడు.

పడిదిలోకి వెళ్ళడంతోనే గౌరీపతిగారు తన మాటకు తిరుగులేదన్న తీరులో, 'బెడ్డింగులు చుట్టేసుకు బయల్దేరండి' అన్నారు.

'నాన్నా.'

'ఏమిరా, ఆ గయ్యాళి గంగమ్మతో పెళ్ళి తప్పిపోయిందనా మొహం వేలాడేశావ్? దీని తల్లాంటి సంబంధం తెస్తాను! ఆమాటకొస్తే ఈసారి పదిహేనువేలు వచ్చే సంబంధం తెస్తాను!'

'నాకు మరో సంబంధం వద్దు; కట్నమూ వద్దు... నేను కాలేజీలో ఇంక తలెత్తి నడవలేను.'

'ఎందువల్ల?'

'కట్నాన్ని కాశవడ కూడదంటూ లెక్చర్లిచ్చిన మొనగాళ్ళలో నే నొకణ్ణి... నువ్వు



మెడలు నొక్కి తీసుకొన్నావు...'

'నా కొడుకేనా ఈ మాటలంటూంటా?'

> దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన ఆరు కథలు
>
> 1. అమ్మా, ఆకలేస్తోందే!
> 2. ఎదురీత
> 3. పాలు
> 4. మనోవ్యాధికి మందు
> 5. మాయమనసులు
> 6. వాన కురుస్తే!

## అమూల్యరత్నం

'నీ బాధ పడలేక ఒప్పుకొని వస్తే, ఆ రెండు వేలూ తరవాత ఇస్తామని వాళ్ళు వింత ప్రార్థించినా విన్నావు కాదు. ఆ అమ్మాయికున్న ధైర్యం నాకు లేకపోయింది. నిన్ను ఒప్పించటానికి ప్రయత్నమైనా చేసి మాట దక్కించుకోలేకపోయాను. ఆ అబ్బాయెవరో అన్నట్లు ఆ అమ్మాయి నిజంగా అమూల్య రత్నం! నేను వెనక్కి వెళ్ళి, క్షమాపణ చెప్పుకొని, ఆమెని పెళ్ళి చేసుకుంటాను.'

గౌరీపతి నిశ్చేష్టుడయాడు. చర చరా పెళ్ళివారింటివైపు నడిచి పోతున్న కుమారుడితో, 'ఆగు...ఆగవూ? సరే ఐతే. ఇంక అక్కడే ఉండిపో. నా గుమ్మం ఎక్కడానికి వీల్లేదింక నువ్వు!'

పెళ్ళివారింటి గుమ్మం ఎక్కుతూన్న రఘురాంపాణికి పెళ్ళికూతురి మేనత్త ఎదురై ప్రశ్నార్థకంగా చూసింది.

'ఒక్క పైసా కూడా కట్నం వద్దు. మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను.'

'చేతులు కాలేక ఆకులు పట్టుకుంటే ఏం లాభం నాయనా? ఈ రమకి అనుకున్న ముహూర్తానికే ఆ మూడు ముళ్ళూ పడడం జరిగింది. మీ నాన్నే వెళ్తూ ఆనందరావుతో 'ఐతే రమని నువ్వే కట్టుకో!' అని వెటకారంగా అన్నమాటే వేదవాక్యమయింది. ఆనందూ రమా ఒకళ్ళ విలువ ఒకళ్ళు తెలుసుకుని వధూవరులయారు...అదిగో, ఆశీర్వచనం జరుగుతోంది.' అంటూ ఆమె అక్షింతలు వెయ్యడానికి లోపలికి వెళ్ళిపోయింది.

## దీపావళి కథల బాలట్ పత్రం

**దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన ఆరు కథలలో నాకు ఉత్తమమని తోచిన వరుసలో ఆరు కథలు :**

| | |
|---|---|
| మొదటి కథ | |
| రెండవ కథ | |
| మూడవ కథ | |
| నాలుగవ కథ | |
| అయిదవ కథ | |
| ఆరవ కథ | |

పంపినవారి పూర్తి పేరు :..............................................

చిరునామా:..............................................

..............................................

..............................................